


వేదికపై కూర్చున్న రంగారెడ్డి కలెక్టర్, అదనపు కలెక్టర్లు శశాంక, ప్రతిమాసింగ్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం అంబరాన్నంటాయి. గ్రామాలు, పట్టణాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, సంఘాల ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. భారత్ మాతాకీ జై నినాదాలతో ఆవరణలు మార్మోగాయి. ఈ సందర్భంగా మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండా స్టిక్కర్లు ధరించి దేశభక్తిని చాటారు. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ తదితర ఎందరో త్యాగధనుల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం రాగా.. 1950 జనవరి 26న ప్రపంచంలోనే గొప్ప సర్వసత్తాక, ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం అవతరించి నేటికీ 75 ఏండ్లు పూర్తైంది.

–రంగారెడ్డి/వికారాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ)



మహిళా ఉద్యోగినికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో పక్కన ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్




రాచకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల మార్చ్‌పాస్ట్

# మువ్వన్నెల మురిపెం

**.ఉమ్మడి జిల్లాలో ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు . వాడవాడలా రెపరెపలాడిన జాతీయ జెండా**







మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి వందనం చేసిన తహసీల్దార్ గణేశ్



మహిళా సంఘాల సభ్యులకు రూ.28.74 కోట్ల చెక్కును అందిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి




వేడుకకు హాజరైన రంగారెడ్డి జిల్లాకు చెందిన అధికారులు






రంగారెడ్డి కలెక్టర్ శశాంక నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సీపీవో సౌమ్య, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలు వెంకటమాధవరావు, అనంతరెడ్డి, సూరజ్‌కుమార్, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్





వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ట్రైనీ కలెక్టర్ అమిత్‌నారాయణ్, డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్, డీఈవో రేణుకాదేవి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణి, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, డీపీఆర్వో సబార్డినేట్ సతీష్, కలెక్టర్ సీసీ విజయ్‌కుమార్‌రెడ్డి

## పరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన

పరిగి టౌన్, జనవరి 26: కంపెనీ పొల్యూషన్‌తో తమ పంటలు నాశనమవుతున్నాయని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన రైతులు సుగుణ స్టీల్ కంపెనీ ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కంపెనీ కాలుష్యంతో పంటలు పూర్తిగా దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నామని ..పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆందోళన చేపట్టారు. కంపెనీలోకి వాహనాలు వెళ్లకుండా గేటు ఎదుట అడ్డుకున్నారు. కంపెనీ నిర్వాహకులు రైతులను సముదాయించే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. సమస్యను పరిష్కరించే వరకూ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.




శుక్రవారం సుగుణ స్టీల్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు

## మాడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

కులకచర్ల, జనవరి 26 : మండలంలోని ముజాహిద్‌పూర్ మాడల్ స్కూల్ విద్యార్థిని అఖిల శివసాయి అండర్–19 వాలీబాల్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 27న కర్ణాటకలో జరుగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, పీడీ కృష్ణారెడ్డి తెలిపారు. కాగా రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆమెను గ్రామంలోని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీఆనంద్, ఉపసర్పంచ్ చంద్రభూపాల్‌రావు, ఎంపీటీసీ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, వార్డు సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

## ఇగ్నైట్ ఫెస్ట్‌లో కొడంగల్ విద్యార్థి ఉత్తమ ప్రతిభ

కొడంగల్, జనవరి 26 : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో భద్రాచలం జిల్లాలో జరిగిన ఇగ్నైట్ ఫెస్ట్‌లో తమ పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కొడంగల్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. హరిచందర్ జూనియర్ విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు చెప్పారు. గణతంత్ర వేడుకను పురస్కరించుకొని శుక్రవారం హరిచందర్‌ను గురుకుల విద్యాలయ సంస్థల కార్యదర్శి డా.నవీన్ నికోలస్, డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అభినందించి ప్రశంసా పత్రంతోపాటు రూ.ఐదు వేల నగదు పురస్కారాన్ని అందించినట్లు చెప్పారు. పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకొచ్చిన స్టూడెంట్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.



అధికారుల నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటుటున్న హరిచందర్

## జక్కని బందయ్యకు డాక్టరేట్ ప్రదానం




షాబాద్, జనవరి 26 : ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు జక్కని బందయ్యకు డాక్టరేట్ వరించింది. శుక్రవారం హోలీస్పిరిట్ క్రిస్టియన్ వర్సిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన 2024 సౌత్ ఇండియా కాన్వకేషన్ ప్రోగ్రాంలో భాగంగా డాక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగంలో బందయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. షాబాద్ గ్రామానికి చెందిన బందయ్య ప్రస్తుతం మొయినాబాద్ మండలంలోని చందానగర్ ప్రభుత్వ పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్నారు. హోలీస్పిరిట్ క్రిస్టియన్ వర్సిటీలో ఆయన భారతీయ విద్యావ్యవస్థ, సమాజంపై కుల ప్రభావం, అంబేద్కర్ కలలుగన్న కుల రహిత సమాజాన్ని నిర్మించడంలో సాధ్య–అసాధ్యాలు అనే అంశంపై రెండేండ్లుగా ఉపకులపతి బిషప్ ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.

## లంబాడీ సంక్షేమ సంఘం రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడిగా బాలూనాయక్

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 26 : లంబాడీ సంక్షేమ సంఘం రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన రమావత్ బాలూనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం లంబాడీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్‌పతినాయక్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా బాలూనాయక్ మాట్లాడుతూ లంబాడీల హక్కుల కోసం పోరాడుతానన్నారు.